క్లుప్తంగా

రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల రైతువేదికలో సోమవారం జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా సన్నరకం జేజీఎల్–24423 వరి విత్తనాలను 50శాతం సబ్సిడీపై అందించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులకు సబ్సిడీ పోను 25కేజీల బ్యాగు రూ.500కు అందించారు. ఈ రకం విత్తనం మధ్యస్తకాల పరిమితి(120నుంచి 125)రోజులకు, నూక శాతం తక్కువగా వచ్చి యాసంగి కాలానికి అనువైన రకంగా గుర్తించినట్లు, ఈ రకం విత్తనాలను జైపూర్ క్లస్టర్ సమీప ప్రాంత రైతులకు అందించినట్లుగా వారు తెలిపారు. ఇందులో మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్, ఏఈవో ప్రణిత, స్థానిక నాయకులు మంతెన లక్ష్మణ్, అంబల్ల రవి ఉన్నారు.

విశ్వనాథ ఆలయంలో ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది జనవరి 13వరకు నిర్వహించనున్నారు. ఆలయాలకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గోవర్ధన భట్టాచార్యులు, శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గట్టుమల్లన్న స్వామి సన్నిధిలో గిరి ప్రదక్షిణ

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ గట్టుమల్లన్న స్వామి సన్నిధిలో రెండో గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహరాజ్ నేతృత్వంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించగా సమీప ప్రాంత భక్తులు పాల్గొన్నారు. గుట్టప్రాంతం అంతా భక్తులతో సందడిగా మారింది.

జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న జీపీ సిబ్బంది

దండేపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించి పర్మినెంట్ చేయాలని జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల శ్రీధర్ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమతి కోసం ఎంపీడీవో ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. జీవో నెం 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉపారపు దినేష్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా గొల్లపెల్లి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నల్ల ప్రసాద్, సభ్యులు సుజిత్, ప్రభాకర్, సతీష్, రాయలింగు, ధర్మయ్య, సుదర్శన్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తాండూర్: జనాభా ప్రాతిపదికనా గ్రామీణుల సౌలభ్యం కోసం గ్రామాల వారీగా మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని తాండూర్ మండల యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుర్గం రామకృష్ణ డిమాండ్ చేశారు. తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు సుభాష్, మోమిన్ అలీ, అహ్మద్, మల్లేష్, వెంకటేష్, మాణిక్‌రావు,శ్రీనివాస్, అంజీ పాల్గొన్నారు.

గిట్టుబాటు అంతంతే..!

- సన్నరకం ధాన్యం పండించిన రైతులకు నిరాశే..
- గతేడాది క్వింటాల్‌కు రూ.3200 వరకు ధర
- ఈసారి బోనస్ ప్రకటించినా పెరగని రేటు
- నిబంధనలతో సతమతమవుతున్న అన్నదాతలు



దండేపల్లి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన సన్న ధాన్యం..

ప్రైవేటులోనే అమ్మాలనుకుంటున్నా..



నా పేరు దత్తయ్య. మాది దండేపల్లి. నేను వానాకాలంలో ఏడు ఎకరాల్లో 101సన్నరకం వరి పండించాను. కొనుగోలు కేంద్రాల్లో సన్నాలకు గిట్టుబాటు ధరతో పాటుగా, బోనస్ ఇస్తున్నా ప్రైవేటు వ్యాపారులు చెల్లిస్తున్న ధరకు పెద్దగా తేడా లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో హమాలీ, సుతిలీ, సంచులు తిప్పడం వంటి పనులు రైతులకు అదనపు భారం అవుతున్నాయి. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకంటే ప్రైవేటులోనే అమ్మాలనుకుంటున్నాను.

దండేపల్లి: ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో రైతులు సంబురపడ్డారు. అప్పటి వరకు దొడ్డు రకాలు సాగు చేసేవారంతా సన్నాల వైపు మొగ్గు చూపారు. దీంతో జిల్లాలో వానాకాలంలో సన్నాల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం బోనస్ ప్రకటించినప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, ప్రైవేటు వ్యాపారులు చెల్లిస్తున్న ధరలో పెద్దగా తేడా కనిపించడం లేదు. దీంతో కొందరు మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తుండగా, మరికొందరు ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. సన్నాలకు గతేడాదితో పోల్చి చూస్తే, ఈ సారి గిట్టుబాటు ధర తక్కువే లభిస్తుంది. దీంతో సన్నరకాలు సాగు చేసిన రైతులకు కొంత నిరాశే ఎదురయ్యిందని చెప్పొచ్చు.

జిల్లాలో సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లాలో వానాకాలంలో సుమారుగా 1.60లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో సూఫర్ ఫైన్ లక్ష ఎకరాల్లో సాగు చేయగా, ఫైన్ రకం 35వేల ఎకరాలు, దొడ్డురకాలు 25వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే సన్నాల సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడు ధాన్యానికి క్వింటాళ్‌కు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 గిట్టుబాటు ధర చెల్లిస్తుంది. అయితే సన్నరకాలకు ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తుంది. దీంతో సన్నాలను ప్రభుత్వం ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేసి, రూ.500బోనస్ చెల్లిస్తున్నప్పటికీ క్వింటాళ్‌కు రూ.2820 గిట్టుబాటు ధర వస్తుంది. ప్రైవేటు వ్యాపారులు కూడా ఇంచుమించు ఇదే ధర చెల్లించడంతో, కొందరు రైతులు ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే గన్నీ సంచులను తిప్పడం, కలర్ దారాల కొనుగోలు, పైగా తేమ శాతం 17కంటే తక్కువ ఉండటం, వ్యవసాయ అధికారులతో ధృవీకరించడం, వంటి నిబంధనలతో క్వింటాళ్‌కు సుమారు రూ.వంద వరకు అదనంగా ఖర్చు అవుతుంది. అంతేకాకుండా ధాన్యం డబ్బులు ఒకసారి, బోనస్ మరోసారి చెల్లిస్తున్నారు. దీంతో సన్నాలకు ప్రభుత్వం బోనస్ చెల్లించినా క్వింటాళ్‌కు రూ.2700 మాత్రమే ధర లభిస్తుంది. అదే ప్రైవేటులో తేమశాతం కొంచెం అటూఇటుగా ఉన్నా కొనుగోలు చేస్తుండటం, సంచి తిప్పడం, కలర్ దారల కొనుగోలు, ధృవీకరణ పత్రాలు అందించే పనులు ఏమీ ఉండకపోవడం, పైగా ఒకేసారి డబ్బులు చెల్లించడంతో చాలా మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకంటే ప్రైవేటులోనే విక్రయిస్తున్నట్లు సమాచారం.

గతేడాదితో పోలిస్తే..

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించినా గతేడాది కంటే ఈసారి క్వింటాళ్‌కు రూ.400వరకు తక్కువ ధర లభిస్తుంది. సన్నాల సాగు పెరగడమా? లేదా మిల్లర్లు సిండికేటుగా ఏర్పడటమా? ప్రభుత్వం సన్నాలను ఎక్కువగా కొనుగోలు చేసేందుకా? అర్థం కావడం లేదు. గతేడాది సూఫర్ ఫైన్ రకానికి క్వింటాళ్‌కు రూ.3200కు పైగా ధర పలకగా, ఈ సారి క్వింటాళ్‌కు రూ.2850 దాటడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయాలకు విధించిన నిబంధనలు ఎత్తివేయడంతో పాటు, అన్ని రకాల సన్నాలు కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మిల్లులకు రైతులు..!

- బియ్యం అమ్మకానికి అన్నదాతల ఆసక్తి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సన్నవడ్లు తీసుకురావడానికి అన్నదాతలు అంతగా ఆసక్తి చూపడం లేదు. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో వడ్లు పట్టించి మరీ బియ్యం విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. సన్న బియ్యం రకాన్ని బట్టి రూ.6వేల నుంచి రూ.6,500 వరకు అమ్ముతున్నారు. హాజీపూర్ మండలంలో 8,500ఎకరాల్లో వరి సాగు చేపట్టగా దాదాపు 5,450ఎకరాల్లో సన్నధాన్యం సాగైనట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేవలం కర్ణమామిడి, పడ్తనపల్లి గ్రామాలకు చెందిన 10మంది రైతులు మాత్రమే 360క్వింటాళ్ల సన్నవడ్లు తీసుకొచ్చి విక్రయించారు. కొనుగోళ్లు తుది దశకు చేరగా సన్నధాన్యం మాత్రం కేంద్రాలకు రావడం లేదు. దీంతో రైస్‌మిల్లుల వద్ద సన్నధాన్యంతో కూడిన ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాలు వరసలో ఉంటూ దర్శనమిస్తున్నాయి.



వేంపల్లి రైస్ మిల్లుకు ట్రాక్టర్లలో రైతులు తీసుకువచ్చిన సన్నవడ్లు

సమాచారం

రేపు జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 18న బుధవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ కరీంనగర్ సంస్థలో 220ఉద్యోగ ఖాళీల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని ఫార్మాసిస్టులు 40, జూనియర్ అసిస్టెంట్‌లు 100, ఆడిట్ అసిస్టెంట్‌లు 30, కస్టమర్ సపోర్టు అసిస్టెంట్‌లు 50ఖాళీల కోసం 18 నుంచి 30సంవత్సరాల లోపు యువతీ, యువకులు అర్హులన్నారు. ఫార్మాసిస్టు పోస్టు కోసం డీ ఫార్మసీ/బీ ఫార్మసీ పాసై ఫార్మసీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, మిగితా పోస్టులకు ఎస్సెస్సీ ఇంటర్ డిగ్రీ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 93923 10323, 91103 68501లలో సంప్రదించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్: నియోజకవర్గంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత మార్కెట్ వద్ద ఉప ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ, 10:30కు ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ, 11గంటలకు భీమారంలో నూతన అంబులెన్స్ ప్రారంభం, 11:30కు జైపూర్ మండలంలోని దుబ్బాపల్లి రోడ్డు పనులు, పవర్ ప్లాంట్ వద్ద స్మారక కమాన్ ప్రారంభోత్సవం, హెచ్ఎం నర్సింహారెడ్డి రోడ్డుగా నామకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

48మందికి పోస్టింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలో 48మంది ఉద్యోగులకు షార్ట్‌ఫైరర్ పోస్టింగ్‌లు పొందారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో సోమవారం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లు పొందారు. ఈ రెండు ఏరియాల్లో ఖాళీగా ఉన్న ఈ షార్ట్‌ఫైరర్ పోస్టులకు వివిధ కేటగిరీల వారు దరఖాస్తులు చేసుకోగా వారి అర్హతను బట్టి పోస్టింగ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ డీజీఎం(పర్సనల్) రాజేశ్వర్, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, ఐటీ అధికారి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌లు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆ సంఘ విద్యార్థి నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 23, 24, 25తేదీల్లో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలను పురస్కరించుకొని నిర్వహించే సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ మిట్ట కార్తికేయ, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలు విజయవంతం చేయండి

బెల్లంపల్లిరూరల్: హైదరాబాద్‌లో జనవరి 5, 6, 7వ తేదీల్లో నిర్వహించే అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్ఎం) 2వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా నిర్మాణ బాధ్యుడు దాగం మల్లేష్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని అంకుశం గ్రామంలో జాతీయ సభల కరపత్రాలు విడుదల చేశారు. సంఘం నాయకులు వెంకటస్వామి, పోచం, గోపి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో శశికళ

జన్నారం: మండల కేంద్రంలోని పొన్‌కల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో శశికళ పరిశీలించారు. వివరాల నమోదు, సర్వే చేసే విధానాన్ని సిబ్బందిని అడిగారు. సర్వే నిర్వహణ పగడ్బందీగా చేసి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఆమెవెంట ఎంపీవో జలేందర్, కార్యదర్శి రాహుల్ ఉన్నారు.

గనులపై కొనసాగుతున్న రక్షణ పక్షోత్సవాలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై సోమవారం రక్షణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రక్షణ పక్షోత్సవ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు విధి నిర్వహణలో అనునిత్యం రక్షణతో మమేకమై విధులు నిర్వర్తించాలని సూచించారు. సంస్థ నిర్దేశిత లక్ష్యం చేరుకోవడానికి సమష్టి కృషి అవసరమని తెలిపారు. రక్షణపై కమ్యూనికేషన్ సెల్ టీం సభ్యులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. అనంతరం గత ఆర్థిక సంవత్సరం భూగర్భ గనుల రక్షణ పక్షోత్సవాల్లో ఆ గనికి గ్రూపు –3 విభాగంలో సింగరేణి వ్యాప్తంగా మొదటి బహుమతి దక్కించుకోగా, గనికి సంబంధించిన కప్‌ను ఆ గని అధికారులకు రక్షణ కమిటీ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఏరియా అధికారులు, యూనియన్ ప్రతినిధులు, గని కార్మికులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: కప్ అందిస్తున్న కమిటీ సభ్యులు

కేకే–ఓసీలో మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ

కేకే –ఓసీ గని ఏరియా మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. ఏరియాలో స్థితిగతులను ఉద్యోగులకు వివరించి నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. విధులకు గైర్హాజర్ లేకుండా హాజరై, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించినప్పుడే నష్టాలు తగ్గుతాయని జీఎం దేవేందర్ పేర్కొన్నారు.

శ్రీరాంపూర్ ఓసీపీలో...

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో రక్షణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం సభ్యులు సోమవారం గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. తనిఖీ బృందం కన్వీనర్, జీఎం(ఎక్స్‌ప్లోజివ్స్) డీ. బైద్య, బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కే. రఘుకుమార్‌లు ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించి అనంతరం తనిఖీలు చేశారు. ఓసీపీ ప్రాజెక్టు అధికారి టీ. శ్రీనివాస్ గనిలో తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ బ్రహ్మాజీ, గుర్తింపు సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ మోతె లచ్చన్న, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, గని ప్రాజెక్టు అధికారి నాగరాజు, రక్షణ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి శంకర్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలి

బెల్లంపల్లి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక (టీవీయూవీ) రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జాతీయ విద్యార్థి సమాఖ్య(జేవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని బీసీ బాలుర వసతి గృహం ఎదుట సోమవారం ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు వేలాది మంది స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుకుంటున్నారన్నారు. వీరికి సక్రమంగా స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వరుసగా మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో అనేకమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు.



ఫ్లకార్డులతో నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సర్టిఫికేట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టకుండా వెంటనే బకాయిలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల శ్రేణులు తిరుపతి, నరేష్, శ్రీకాంత్, సురేష్, దీపక్, హరీష్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఇన్నోవేటర్

తాండూర్: మండలంలోని మాదారం త్రీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి చందనాల అజయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఉపాధ్యాయుడు విద్యాసాగర్ మార్గదర్శకంలో వుమెన్ సేఫ్టీ హెయిర్ రబ్బర్ బ్యాండ్‌ను తయారు చేశాడు. ఆపద కాలంలో ఆ రబ్బర్ బ్యాండ్‌ను నొక్కగానే పోలీసు హారన్ సౌండ్ రావడంతో పాటు షీటీమ్ కార్యాలయంలో మాటల రూపంలో శబ్దం వస్తుంది. అజయ్‌కుమార్‌ను సోమవారం ఎంఈవో మల్లేశం ప్రత్యేకంగా అభినందించారు.

టీచర్‌తోకలిసి ప్రదర్శిస్తున్న అజయ్‌కుమార్ →



గని దారిలో చీకట్లు..!

- రాత్రి పూట ఇబ్బంది పడుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: అన్ని గనులు శ్రీరాంపూర్‌లోనే ఉండగా, వీధిలైట్లు లేక రాత్రి షిఫ్ట్ డ్యూటీలకు వెళ్లే సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ, గోదావరికాలనీలో ఎక్కువ మంది కార్మికులు నివాసం ఉండగా, వీరంతా నిత్యం ఇక్కడి నుంచి శ్రీరాంపూర్ గనులకు డ్యూటీలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ప్రతీరోజు కార్మికులంతా రాయల్‌టాకీస్ చౌరస్తా నుంచి ఎస్సార్పీ 3 గని మీదుగా ఉన్న దారిలో డ్యూటీలకు వెళ్తారు. సుమారు కిలోమీటరున్నర ఉన్న ఈ మధ్య రోడ్డుపై వీధిలైట్లు లేవు. చాలా కాలంగా కార్మికులు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తుమ్మ పొదలు రోడ్డును కమ్ముకొని ఉన్నాయి. చీకట్లో తుమ్మ ముళ్లు చీరుకుపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు. గోదాములకు నిత్యం లారీలు నడవడం వల్ల రోడ్డు గుంతల మయమైంది. దీంతో రాత్రి పూట వీధిలైట్లు లేక, గుంతల రోడ్డుపై బైక్‌లపై వెళ్తూ కార్మికులు కింద పడి గాయాలపాలవుతున్నారు. రూ.కోట్ల టర్నోవర్‌తో నడిచే సంస్థలో వీధి దీపాల ఏర్పాటుకు అధికారులు ఇంత జాప్యం చేయడం సరికాదని కార్మికులు ఆరోపిస్తున్నారు.



రాయల్‌టాకీస్ నుంచి ఎస్సార్పీ 3 మధ్య రోడ్డు

జీఎం దృష్టికి సమస్య..

ఇటీవల గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు, యాజమాన్యానికి మధ్య స్ట్రక్చర్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆ యూనియన్ నాయకులు దీన్ని డిమాండ్‌గా పెట్టి చర్చించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

మంచిర్యాలఅగ్రికల్చర్: నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడియారం శ్రీహరి, రామ్మోహన్ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న నాన్‌గెజిటడ్ ఉద్యోగులకు టీఎన్జీవో సభ్యత్వం నమోదు చేశారు. అనంతరం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా బీసీ సంక్షేమ అధికారి పురుషోత్తంనాయక్, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

లక్సెట్టిపేట: మండలంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ ఆర్ఐ శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా మంది నిరుపేదలు ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పట్టించుకొని ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కొంతమంది రైతులు భూములు సాగుచేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా, వారికి పట్టాలు ఇవ్వలేదని సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప దీక్షాపరులు

మందమర్రిరూరల్: అయ్యప్ప దీక్షా పరులు మొక్కులు అప్పగించడానికి సోమవారం స్థానిక ప్రాణహిత కాలనీ నుంచి శబరిమలకు బయల్దేరారు. వారిని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, తోటి అయ్యప్ప భక్తులు, వారి కుటుంబ సభ్యులు సాగనంపారు.



మహిళా భద్రతపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సోమవారం షీటీం, ఎన్ఎస్ఎస్ యూనిట్ –2 ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో నేడు మహిళలపై జరుగుతున్న సంఘటనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ క్రైం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు జ్యోతి, శ్రావణ్, ప్రిన్సిపాల్ పాండురంగశర్మ పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాండురంగశర్మ